క్లుప్తంగా

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొవ్వూరు: సత్యసాయి సేవా సంస్థలు సెప్టెంబర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పట్టణం ఎస్‌టీఎస్ పీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు తెలుగు విభాగంలో ప్రతిభ కనపరిచారు. జిల్లాస్థాయి చోళ్ల జయశ్రీ ప్రథమ స్థానం, కుసుమ దుర్గాభవానీ ద్వితీయస్థానం సాధించినట్లు కొవ్వూరు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ ప్రకటించారు. సోమవారం కళాశాలలో ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ రావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల స్థాయిలో మురుకొండ సాయిదీపిక ప్రథమ స్థానం, షేక్ తహిరున్నిషా బేగం ద్వితీయ స్థానం, ఆంగ్ల విభాగంలో రాపాక లలితాంబిక ద్వితీయ, సోంపల్లి భారత్ తృతీయ స్థానం పొందారన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్

నిడదవోలు : బీజేపీ నిడదవోలు పట్టణ అధ్యక్షుడిగా మోర్త ప్రమోద్‌కుమార్ ఎంపికయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు సోమవారం నియామక పత్రాలు అందజేశారు. పట్టణ బీజేపీ సీనియర్ నాయకులు మోర్త సత్యనారాయణ కుమారుడు ప్రమోద్‌కుమార్ గతంలో పట్టణ బీజేపీ యూత్ అధ్యక్షుడిగా, జిల్లా బీజేపీ యూత్ మీడియా కన్వీనర్‌గా పనిచేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చాగల్లు: మండలంలోని చిక్కాల, కలవలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని చిక్కాల, చిక్కాలపాలెం, కలవలపల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా ఈనెల 7వ తేదీన మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దేవరపల్లి: చిన్నాయగూడెంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కోసం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నాయగూడెం, చిలకావారిపాకలు, కుంతలగూడెం ఫీడర్లపై గల గృహ వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్న ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.

యువత బాధ్యతగా, చైతన్యంగా ఉండాలి

ఉండ్రాజవరం: రాజకీయాలు, రాజకీయ వివాదాలు, కుల సంబంధిత అంశాలపై యువత బాధ్యతగా, చైతన్యంగా ఉండాలని భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. తాడిపర్రు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామంలో రెండు నెలల క్రిందట సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతంతో నలుగురు యువకులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన నలుగురు కుటుంబాల ఇళ్లకు వెళ్లి కుటుంబ పరిస్థితులను తెలుసుకుని ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని రామచంద్ర యాదవ్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, మారిశెట్టి సూరిబాబు, డాక్టర్ అనూష యాదవ్, పాల రమేష్, హరిబాబు, అత్తిలి రాజు, బర్ల శ్రీనివాసు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కొవ్వూరు: పట్టణంలో ఎనిమిదో వార్డులో బాలదారి వారి వీధి చెందిన కాకి పద్మావతి(42) అనే మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. అది చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి భర్త 14 ఏళ్ల క్రితమే మృతి చెందారు. ప్రస్తుతం ఈమె తన కుమారుడితో కలిసి బావ కుటుంబంతోపాటు కలిసి ఉంటుంది. ఏం కష్టం వచ్చిందో ఏమో గానీ సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని మృతి చెందింది. పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఇంకా ఏ విధమైన ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఆమె మృతికి దారి తీసిన కారణాలు ఏమిటనేది ఇంకా తెలియరాలేదన్నారు.

కుట్టు శిక్షణను మహిళలు ఉపాధిగా మార్చుకోవాలి

కొవ్వూరు: మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. రాజమహేంద్రవరం రోటరీక్లబ్ సౌజన్యంతో పట్టణంలో మునిసిపల్ కార్యాలయం వెనుక ఉన్న సచివాలయంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ పూర్తయ్యింది. వారికి మెషీన్లు అందజేశారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సర్వ శిక్షా అభియాన్ ఆడిట్ సంస్థ స్టేట్ రీసోర్స్ పర్సన్ బి.సూర్య పరిశీలించారు. సోమవారం సోషల్ ఆడిట్‌లో భాగంగా హైస్కూల్లో అమలు జరుగుతున్న పలు అంశాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆరా తీశారు. భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఆదమరిస్తే అంతే..

- కెనాల్ రోడ్డులో ప్రయాణం ప్రమాదం
- కోతకు గురైన రోడ్లు
- కొట్టుకుపోయిన మార్జిన్లు
- తరచూ ప్రమాదాలు
- ఆందోళనలో ప్రయాణికులు

పెరవలి: కెనాల్ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు పొడవునా మార్జిన్ కోతకు గురవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. నిడదవోలు–నర్సాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇప్పటి వరకు కాపవరం, అజ్జరం, తీపర్రు, ఉసులుమర్రు గ్రామాల వద్ద రోడ్డు కోతకు గురైంది. వీటితోపాటు పెరవలిలో రోడ్డు మార్జిన్ కూడా దిగిపోవడంతో ప్రజలు రాకపోకలకు భయపడుతున్నారు. అసలే రోడ్డు మార్జిన్ అంతంతమాత్రంగా ఉంటే ఈ రహదారిలో ఉన్న మార్జిన్ కాస్తా దిగబడిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

మార్జిన్ కొట్టుకుపోవడంతో..

గతంలో కెనాల్ కాలువ ఆధునీకరణ పనుల్లో ఇరిగేషన్ అధికారులు రోడ్డు పక్కన సిమెంటు గోడల నిర్మించకుండా రెండో వైపు కాలువ గట్టుకి చేపట్టడంతో ఇప్పుడు ఈ రోడ్డు మార్జిన్ కోతకు గురైందని స్థానికులు చెబుతున్నారు. గతంలో మట్టిగట్టు మార్జిన్లు కోతకు గురైనా రోడ్డు మార్జిన్ అంతగా కోతకు గురయ్యేది కాదని, ఇప్పుడు గోడల నిర్మాణం వలన నీటి ప్రవాహ వేగం ఎక్కువ అవడంతో రోడ్డు మార్జిన్ పూర్తిగా కొట్టుకుపోయిందని చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు నిర్మించి చేతులు దులుపుకోవడమే తప్ప మార్జిన్ పటిష్టతకు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికే ఈ రోడ్డు పొడవునా మార్జిన్ రెండు అడుగుల నుంచి నాలుగు అడుగుల మేర మాత్రమే ఉంది. మూడేళ్ల క్రితం పెరవలి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ట్యాక్సీ నేరుగా కాలువలోకి దూసుకుపోగా రోడ్డు పక్కనే ఉన్నా రుప్పలు బలంగా ఉండడంతో అలాగే ఉండిపోయింది. అదే గతేడాది ఫిబ్రవరిలో ఇదే ప్రాంతంలో ఊక లారీ నేరుగా కాలువలోకి వెళ్లిపోయింది. రెండేళ్ల క్రితం జూలై 19న కాకరపర్రు వద్ద క్వారీ లారీ కాలువలోకి పడిపోయింది. ఆ సమయంలో ఒకరు మృతి చెందగా ముగ్గురు క్షతగాత్రులయ్యారు. కాలువల్లో వాహనాలు పడి గత నాలుగేళ్ల కాలంలో 12 ప్రమాదాలు జరగ్గా ఇందులో 16 మంది క్షతగాత్రులు అవ్వగా, 8 మంది ప్రాణాలు కోల్పోయారు.

నరకం చూస్తున్నాం



నిడదవోలు– నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రయాణం అంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు మార్జిన్‌లేకపోవడం, ఉన్న రోడ్డు పాడైపోవడంతో నరకం చూస్తున్నాం. వాహనాలు వచ్చినప్పుడు కాలువలోకి పడిపోతామా అన్నట్టుగా ఉంది.

– ఆగర్తి కృష్ణారావు, ప్రయాణికుడు పెరవలి

ప్రమాదకరం



రోడ్డు మార్జిన్ కోతకు గురవడంతో కెనాల్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారులు రోడ్డు వేస్తున్నారే కానీ మార్జిన్‌ను పటిష్టపరచటం లేదు. దీని వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో రావాలంటేనే భయపడాల్సి వస్తోంది.

– కాపకా పాపారావు ప్రయాణికుడు కాకరపర్రు



పెరవలి లాకుల సమీపంలో కోతకు గురైన రోడ్డు మార్జిన్



కాపవరం వద్ద కోతకు గురై మార్జిన్ లేక ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



కాకరపర్రు వద్ద రోడ్డు మార్జిన్‌లేక ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

గర్భిణులకు ఆకుకూరల పంపిణీ

దేవరపల్లి: బంధపురంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏర్పాటు చేసిన పోషక వాటికలో పెంచిన పలు రకాల ఆకుకూరలను సోమవారం సర్పంచ్ కాత్రగడ్డ పరమేశ్వరరావు(గాంధీ) పంపిణీ చేశారు. తోటకూర, గోంగూర, కొత్తిమిర, పాలకూర, మెంతికూర, చుక్కకూరను పంచాయతీ పరిధిలోని నలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులకు అందజేశారు. గ్రామ శివారున ఉన్న పోలవరం కుడి కాలువ సమీపంలో పోషక వాటికను ఏర్పాటు చేసి సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలను సాగు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎం.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ మహమ్మద్ షరీఫ్, అంగన్‌వాడీ కార్యకర్తలు చిడిపి సూర్యామణి, చోళ్ల రమాదేవి, మనెల్లి బొజ్జమ్మ, చదలవాడ దుర్గ, ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, గర్భవతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకు కూరలను పరిశీలించిన సీడీపీవో

తాళ్లపూడి: మలకపల్లి సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషకాహార వాటిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు సీడీపీవో మమ్మి పరిశీలించారు. ఆమె మలకపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పెంచుతున్న ఆకు కూరలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఉపసర్పంచ్ మద్దిపాటి రామారావు, సెక్టార్ సూపర్ వైజర్ భానుమతి, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరి, గర్భిణులు, బాలింతలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మలకపల్లిలో పోషకాహార వాటిక కార్యక్రమంలో ఆకుకూరలను పరిశీలిస్తున్న సీడీపీవో

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ ప్రశాంతి
- నల్లజర్లలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 47 అర్జీలు

నల్లజర్ల: ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు కలెక్టరు హాజరై వినతులు స్వీకరించారు. మొత్తం 47 అర్జీలు స్వీకరించగా వాటిలో ఎక్కువగా భూ సమస్యలపైనే ఉన్నాయి. ఏడేళ్ల క్రితం హైవేకోసం తమ వద్ద తీసుకున్న భూములకు పరిహారం అందించడంలో జాప్యం జరిగిందని ఇప్పటికి 15 మంది రైతులు కోర్టును ఆశ్రయించినట్టు నల్లజర్లకు చెందిన వెల్లిసుబ్బారావు, కండెపు వెంకటరత్నం తదితరులు అర్జీ సమర్పించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఒకే సర్వే నంబరులో ధరలు వేర్వేరుగా ప్రకటించారని రైతులు ఆరోపించారు. గండిదారి పుంతకు పూడిక తీసి గుర్రపుడెక్క తొలగించాలని దానివెంబడే వైఎస్సార్ లైఅవుట్‌కు రహదారి ఏర్పాటు చేయాలని బొమ్మిరెడ్డి వెంకటసత్యనారాయణ, మార్ని శ్రీనివాస్,స్వామి కుమార్ తదితరులు వినతి పత్రం అందజేవారు. ఇలా రైతుల నుంచి భూములకు సంబంధించి ఫిర్యాదులు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమస్యలన్నీ సత్వరమే పరిష్కరించాలని ఆయా అధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు డీఎల్‌డీఓ స్లీవారెడ్డి, ఎంపీడీఓ సింహాద్రి, ఇన్‌చార్జి తహసీల్దారు స్వామినాయుడు, డిప్యూటీ తహసీల్దారు శాంతిప్రియ, హౌసింగ్ డీఈ శేఖర్ బాబు, అధికారులు పాల్గొన్నారు.



నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు ప్రశాంతి

రాజగిరి సేవలు ఆదర్శనీయం



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రేమ్‌జిత్‌కుమార్, చైర్‌పర్సన్ దయరాజగిరి

నిడదవోలు: సమాజంలో నిరాధరణకు గురవుతున్న అభాగ్యులకు ఆదరించి విద్య, ఆహార, ఆరోగ్య సంరక్షణ వంటి సేవలను అందించి సామాజిక సేవలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న రాజగిరి అందరికీ ఆదర్శప్రాయమని వరంగల్ మిషన్ ఇండియా బైబిల్ కళాశాల ప్రిన్సిపల్ రెవ.డాక్టర్ ప్రేమ్‌జిత్‌కుమార్ అన్నారు. పట్టణంలో మెంటే సుందరరావు మెమోరియల్ సెయింట్ జాన్స్ టౌన్ లూథరన్ చర్చిలో సోమవారం సంఘ సేవకులు, గుడ్‌సమరిటన్ సంస్థల వ్యవస్థాపకుడు, లోక్ అదాలత్ మాజీ సభ్యులు మెంటే రాజగిరి 14వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. రాజగిరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చర్చి చైర్‌పర్సన్ మెంటే దయ రాజగిరి చేతుల మీదగా వృద్ధులు, వితంతువులు, మహిళలకు నూతన చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ రెవరెండ్ కోరుమిల్లి కమలాకర్, నరసాపురం పాస్టర్ రెవరెండ్ కె.డానియేల్‌రాజు, బేబి కమలాకర్, కె.సుజ్ఞానరాజు, డి.విజయకుమార్, మెంటే జయ ప్రియదర్శిని, ఎం.ప్రవీణ్‌కుమార్, సుహాస్‌రాజ్ ఐజాక్, బి.జ్ఞానకుమారి, అభి, మహిళా సమాజం, సంఘస్థలు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ఉండ్రాజవరం: సంక్రాంతి ముసుగులో పేకాట, కోతాట, గుండాట, కోడిపందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ అన్నారు. కోడిపందేల నిర్వహణను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించకుండా గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కోడిపందేల అడ్డుకట్టకు గ్రామ, మండల స్థాయిలో అధికారులతో టీమ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు మాట్లాడుతూ కోళ్ల పందేల బరిలు తయారు చేసిన, కోడిపందేలు నిర్వహించిన చట్టరీత్యా నేరమన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 47 మందిని బైండోవర్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.రామారావు, ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, వీఆర్‌వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు డైట్‌లో రంగోత్సవ్

నల్లజర్ల: జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్‌లో) దూబచర్లలో బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి ×రంగోత్సవ్ 2024–25×పోటీలు నిర్వహించనున్నట్టు డైట్ ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థలలో 6వ తరగతి నుంచి 12 వరకూ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. క్విజ్, డ్రాయింగ్ పోటీలు(స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు), హ్యాండ్ రైటింగ్ (తెలుగు, ఇంగ్లిష్), రంగోలీ (గ్రూప్ ఈవెంట్–ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు), ఆంధ్రప్రదేశ్, పంజాబీ జానపద నృత్యాలు, డిజిటల్ కొలేజ్ (యూనిటీ, ఇంటిగ్రిటీ), స్లోగన్ రైటింగ్(ఏక్‌భారత్–శ్రేష్ఠ భారత్) అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. రంగోలి మినహా అన్ని పోటీలకు ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అనుమతిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పాఠశాల నుంచి సీనియర్ లెక్చరర్ పి.వి.రమణ మూర్తి ఫోన్ నంబరు 99518 17359ను సంప్రదించాలన్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

మునిపల్లిలో మినప పంట దగ్ధం

నిడదవోలు రూరల్: మునిపల్లి గ్రామానికి చెందిన రైతు కె.వెంకట్రావుకు చెందిన మినప పంటను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు సోమవారం తెలిపారు. రైతు వెంకట్రావు తన రెండు ఎకరాల మినప పంటను ఈనెల 4న కుప్పలుగా వేసి ఇంటికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం నిప్పంటించారని తెలిపారు. బాధిత రైతు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వీరబాబు పేర్కొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలి

తాళ్లపూడి: రబీలో రైతులకు ఎరువులు, ఇతర పురుగు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలో కొద్ది రోజులుగా యూరియా రైతులకు అందుబాటులో లేదన్న వార్తలు పత్రికల్లో వచ్చాయి. సోమవారం మలకపల్లిలోని ఎల్ఎస్‌సీ సొసైటీని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణీసుస్మిత మాట్లాడుతూ రైతులకు ఫెర్టిలైజర్స్ సరఫరా చేసే క్రమంలో రైతు వివరాలు, ఆధార్ కార్డు సంఖ్య ఆధారంగానే సరఫరా చేయాలన్నారు. రైతు సాగు విస్తీర్ణం కలిగిన మేరకు ఎరువుల వినియోగం ఉండాల్సి ఉంటుందనీ స్పష్టం చేశారు. సొసైటీలో సోమవారం 560 బస్తాల యూరియా విక్రయించినట్టు తెలిపారు. మండల పరిధిలో అవసరం మేరకు బఫర్ స్టాక్ ముందుగా ఇండెంట్ పెట్టి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో వెంట మండల వ్యవసాయాధికారి జి.రుచిత, సిబ్బంది ఉన్నారు.



మలకపల్లి సొసైటీ వద్ద ఎరువులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో రాణీ సుస్మిత

ఎస్సీ గ్రామంలో ఓసీలకు రిజర్వేషన్

పెరవలి: రేషన్ షాపు నూతన డీలర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన ఇచ్చారు. అక్కడ డీలర్ స్థానాన్ని ఓసీల కేటాయించారు. అయితే గ్రామంలో ఒక్క ఓసీ లేనప్పుడు ఎలా రిజర్వేషన్ చేశారని, అందరూ ఎస్సీలే ఉన్నప్పుడు ఓసీలకు ఎలా కేటాయిస్తారని లంకమాలపల్లి ఎంపీటీసీ బొకే వెంకటేశ్వర్లు కోరారు. పెరవలి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. తహసీల్దార్ డి.అచ్యుత కుమారి మాట్లాడుతూ రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ కేటాయిస్తారని అదే గ్రామంలో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 6 ఫిర్యాదులు వచ్చాయని ఇందులో నాలుగు ఆన్‌లైన్ చేశామని, రెండు ఆఫ్‌లైన్‌లో తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు

నిడదవోలు: పట్టణంలో ప్రధాన గణపతి జంక్షన్‌లో ఐ లవ్ నిడదవోలు పార్కు వెనుక భాగంలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పువ్వల రతీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు పనులను పరిశీలించారు.

అక్రమాలకు పాల్పడిన అధికారులు

- మండల పరిషత్‌కు చెందిన ఐరన్ సామాన్ల తరలింపు
- ఎటువంటి అనుమతులు లేకుండా అమ్మకాలు
- తగలబెట్టిన 60 ఏళ్ల రికార్డులు
- నాకు ఏమీ తెలిదంటున్న ఎంపీడీఓ

పెరవలి: కంచె చేను మేసిందన్న చందంగా ప్రభుత్వ ఆస్తులు కాపాడవలిసిన అధికారులు అడ్డదారుల్లో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న ఇనుప సామాన్లు అమ్ముకోవడం దారుణం అంటున్నారు. ప్రభుత్వ కార్యాలయంలోని సామాన్లు, పేపర్లు మరే వస్తువులైనా అమ్మి వేయాలన్నప్పుడు ముందుగా ఆ కార్యాలయంలోని కమిటీ, బోర్డు సభ్యుల ఆమోదం తీసుకుని, ఆ తరువాత టెండర్ల రూపంలో అమ్మకాలు చేపట్టాలి కానీ ఎటువంటి అనుమతులు లేకుండా కనీసం, ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా దొంగచాటుగా అమ్మివేసిన సంఘటన ఆదివారం జరిగింది. స్థానిక మండల పరిషత్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన ఈ ప్రాంతంలో సంచలనం రేపింది. మండల అధికారులు నీతి వాఖ్యాలు చెప్పటమే కానీ వారు ఆచరణలో పాటించరని దీనిని బట్టే తెలుస్తోంది. కనీసం ఎవరి అనుమతులు తీసుకోకుండా వేలాది రూపాయిలు విలువ చేసే సామగ్రిని ఎవరికి తెలియకుండా అమ్మకం చేశారు. వివరాల్లోకి వెళ్ళితే పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం కార్యాలయ సూపరింటెండెంట్ ఘంటా శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర శంకర్ కలిపి ఈ దారుణానికి పాల్పడ్డారు. 1940 నుంచి ఈ కార్యాలయంలో ఉన్న రికార్డులను తగుల బెట్టటమే కాకుండా కార్యాలయానికి వచ్చే అన్ని రకాల న్యూస్ పేపర్లు ప్లాస్టిక్ సామాన్లు, ఐరన్ బీరువాలు, ఐరెన్ కుర్చీలు, ఐరన్ టేబుల్స్, ఫ్యాన్లు, ఎన్నికల్లో వినియోగించే ట్రంకు పెట్టెలు, ఐరెన్ సామన్లు మొత్తం వ్యాన్లు, ఆటోలపై తరలించి వేశారు. వీరు సామాన్లు తరలించే సమయంలో ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు వచ్చి ఇదేమిటి సామాన్లు ఎక్కడికి పట్టుకెళ్లుతున్నారు, అసలు ఏమి చేస్తున్నారు అని ప్రశ్నించగా, ఎంపీపీతో చెప్పే చేస్తున్నాం అని అధికారులు సమాధానం ఇచ్చారు. దీంతో ఎంపీపీకి ఫోన్ చేస్తే పేపర్లు తీసివేస్తామని చెప్పారని ఐరన్ సామాన్లు అమ్మడం ఏమిటని వీడియో, ఫొటోలు తీసి ఉంచమని చెప్పినట్టు తెలిసింది. ఒక మండల పరిషత్ కార్యాలయంలో సామాన్లు, పేపర్లు అమ్మకాలు చేయాలంటే టెండర్ ప్రకటన, మండల పరిషత్ ఆమోదం, ఎంపీపీ నోట్‌లో ఏయే సామాన్లు ఏమి అమ్మకాలు చేస్తున్నామో చెప్పాల్సి ఉంది, కానీ ఎటువంటి అనుమతులు లేకుండానే ఇవి అమ్మివేశారు. ఐరన్ సామాన్లు వ్యాన్, ఒక ఆటో అవ్వగా, ప్లాస్టిక్క్ సమాన్లు, ఒక ఆటో, పేపర్లు ఒక ఆటో అవ్వగా వాటిని చాకచక్యంగా తరలించారు. ఇవి అన్ని ఎటువంటి ప్రకటన లేకుండా దారి మల్లించటంతో అందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతులు తీసుకున్నారా అంటే అదీ లేదు.

ఎంపీపీని తప్పు దోవ పట్టించిన అధికారులు

పెరవలి మండల పరిషత్ అధ్యక్షులు కార్చెర్ల ప్రసాద్‌కి పేపర్లు ఎక్కువైపోయాయని, పాత రికార్డు పాడైపోయిందని ఇలా ఉంటే చెదలు పడతాయని వీటిని తొలగిస్తామని అధికారులు చెప్పడంతో ఆయన నిబంధనల ప్రకారం చేయాలని ఆదేశించారు. కానీ అధికారులు వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలనే దురుద్దేశంతో వీటితో పాటు వ్యాన్ ఐరన్ సామాన్లు అమ్మేశారు. దీనినిపై ఎంపీపీని వివరణ కోరగా కేవలం న్యూస్ పేపర్లు మాత్రమే తీస్తామని తనతో చెప్పారని, ఐరన్ గురించి ఏమీ చెప్పలేదని ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని అధికారులను అడిగిన తరువాత పూర్తి వివరాలు తెల్పుతామని చెప్పారు.



పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో వ్యాన్‌పై ఐరన్ సామాన్లు పంపిస్తున్న అధికారులు

నిజంగా తెలియదు



ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణను వివరణ కోరగా పేపర్లు, రికార్డులు తొలగించామని చెప్పగా, ఏం తీసారో మీకు నిజంగా తెలియదా అని ప్రశ్నించగా తనకు తెలియదని చెప్పారు. ఒక వ్యాన్, ఒక ఆటో ఐరన్, ఒక ఆటో న్యూస్ పేపర్లు , ఒక ఆటో ప్లాస్టిక్ సామాన్లు తరలించారని చెప్పితే తనకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఈ అక్రమ అమ్మకంలో ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడవలిసిందే.